సాక్షి
పెద్దపల్లి

మంగళవారం ; 11 ; మార్చి ; 2025



పారిశుధ్య పనుల పరిశీలన

పెద్దపల్లిరూరల్/కమాన్‌పూర్: పెద్దకల్వల, గుండారంలో చేపట్టిన పారిశుధ్య పనులను డీపీవో వీరబచ్చయ్య పరిశీలించారు. పారిశుధ్యం నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.



బదిలీపై వెళ్తున్న సీపీకి వీడ్కోలు

గోదావరిఖని: సీఐడీ ఐజీగా బదిలీపై వెళ్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్‌కు సిబ్బంది వీడ్కోలు పలికారు. సీపీ వాహనాన్ని కమిషనరేట్ మెయిన్ గేట్ వరకు తాళ్లతో లాగారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సా॥)	సహర్ బుధవారం (ఉ॥)
కరీంనగర్ :	6.27	5.06
పెద్దపల్లి :	6.30	5.05
సిరిసిల్ల :	6.26	5.16
జగిత్యాల :	6.30	5.05

న్యూస్‌రీల్

సీఐఎస్ఎఫ్ సేవలు భేష్



మాట్లాడుతున్న ఈడీ చందన్‌కుమార్ సామంత

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ భద్రతకు సీఐఎస్ఎఫ్ అందిస్తున్న సేవలు భేషుగ్గా ఉన్నాయని రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సామంత ప్రశంసించారు. మల్క్యాపూర్ రోడ్డులోని సీఐఎస్ఎఫ్ బ్యారక్స్‌లో సోమవారం కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్ఎఫ్) వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఆయన భద్రతా దళాల నుంచి గౌరవవందనం స్వీకరించి మాట్లాడారు. దేశభద్రత, కీలకఆస్తుల రక్షణలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది చేస్తున్న కృషి అమోఘమన్నారు. కార్యక్రమంలో సీనియర్ కమాండెంట్ ముఖేష్‌కుమార్, ఎన్టీపీసీ అధికారులు, సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బల్దియాలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ప్రారంభం



పారిశుధ్య పనులు తనిఖీ చేస్తున్న అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరంలో సోమవారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ప్రారంభమైంది. జోన్‌కు ఒక డివిజన్ చొప్పున రోజూ 12 డివిజన్లలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. కలెక్టర్, ప్రత్యేకాధికారి కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు కమిషనర్ (ఎఫ్ఏసీ) అరుణశ్రీ పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. చెత్త కుప్పలను తొలగించడం, మురుగునీటి కాలువల్లో పూడిక తీయడం తదితర పనులు నిర్వహిస్తున్నారు. ఈనెల 14వ తేదీ వరకు పారిశుధ్య పనులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. బల్దియా డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి పనులు తనిఖీ చేశారు.

జాతీయ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

మంథని: పట్టణానికి చెందిన సిటోరియో కరాటే విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు ఇన్‌స్ట్రక్టర్ కావేటి సమ్మయ్య తెలిపారు. సబ్ జూనియర్ కుమితే విభాగంలో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారన్నారు. బండారి మణికంఠ, ఎం.శివ, బాసాని మనోహర్, అక్షిత బంగారు, మనస్వి, అద్వితి వెండి, సహస్ర, మనోజ్ఞ కాంస్య పతకాలు సాధించిన వారిలో ఉన్నారని వివరించారు.

క్వింటాలు పత్తి రూ.6,913

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం పత్తి క్వింటాలుకు గరిష్ఠంగా రూ.6,913 ధర నమోదైందని మార్కెట్ కమిటీ కార్యదర్శి మనోహర్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.5,016, సగటు ధర రూ.6,611గా నమోదైందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 202 మంది రైతుల నుంచి 746 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): చదువులో వెనుకబడిన ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎఫ్ఎల్ఎన్ జిల్లా రిసోర్స్ పర్సన్ రవి సూచించారు. ఉపాధ్యాయులు చతుర్విధ ప్రక్రియల ద్వారా విద్యాబోధన చేయాలన్నారు. ఊశన్నపల్లె ప్రభుత్వ పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, రికార్డులు పరిశీలించారు. వ్యక్తిగత పరిశీలనతోనే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచవచ్చని తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సునీత, స్కూల్ హెచ్ఎం సమ్మయ్య, ఉపాధ్యాయులు అమృత, సురేశ్, కుమార్, శ్రీవాణి ఉన్నారు.

'పట్టు'తో రైతులకు లాభాలు

జూలపల్లి(పెద్దపల్లి): పట్టు పురుగుల పెంపకంతో రైతులకు అధిక లాభాలు వస్తాయని పరిశోధన కేంద్రం రీజినల్ సెరికల్చర్ రీసెర్చ్ సైంటిస్ట్ వినోద్‌కుమార్ అన్నారు. జూలపల్లి మండలం అబ్బాపూర్ గ్రామ శివారు రైతువేదికలో సోమవారం పట్టురైతు దినోత్సవం నిర్వహించారు. పట్టు పరిశ్రమ అధికారులు పట్టు పురుగుల పెంపకం, యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి రాఘవేంద్ర, అధికారి తిరుపతిరెడ్డి, సూపరింటెండెంట్ దాసు, మండల అధికారి మహేశ్, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ అస్తవ్యస్తం



ఈచిత్రంలో కాలిపోతున్న చెత్త రామగుండం కార్పొరేషన్ పరిధిలోని గోదావరి నదీతీరంలో ఉన్న డంపింగ్‌యార్డులోనిది. మొత్తం 50 డివిజన్ల రోజూ 83 వాహనాల్లో సుమారు 118 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి ఆర్ఎఫ్‌సీఎల్‌కు చెందిన ఖాళీస్థలాల్లో వేస్తున్నారు. తద్వారా ఇంటివద్దే తడి, పొడి చెత్త వేర్వేరు సేకరణ ప్రక్రియ అమలు కావడం లేదు. ఇలా సేకరించిన తడిపొడి చెత్తను డంప్‌కార్డులో కుప్పగా పోసి తగలబెడుతున్నారు.

- తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాల్సి ఉన్నా.. కలిపే సేకరిస్తూ.. డంపింగ్ యార్డుల్లో కాల్చివేస్తూ..
- కాగితాల్లోనే వేర్వేరు సేకరణ ప్రక్రియ
- అవగాహన లోపం, మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యమే కారణం
- బల్దియాల్లో లోపిస్తున్న పారిశుధ్యం



ఇవి తడి, పొడి చెత్త సేకరించేందుకు ఏర్పాటు చేసిన ట్రిబుల్ డస్ట్‌బిన్‌లు. రామగుండం కార్పొరేషన్ పరిధి మార్కండేయకాలనీ తగర వీధిలోనివి. తడి, పొడి, హానికరమైన చెత్తను ఆ డబ్బాల్లో వేయాల్సి ఉంది. అవగాహనలేక స్థానికులు నిర్లక్ష్యంతో మొత్తం చెత్తను డబ్బాల్లో నింపుతున్నారు. సిబ్బంది సైతం చెత్తను డంపింగ్‌యార్డుకు అలాగే తరలిస్తున్నారు.

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలోని బల్దియాల్లో తడి, పొడి చెత్త సేకరణ లక్ష్యం నెరవేరడం లేదు. చెత్తను రోజూ వేరుచేసి సేకరించాల్సి ఉన్నా సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లాలో రామగుండం కార్పొరేషన్‌తోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి నుంచి రోజూ సుమారు 180 టన్నుల చెత్త వెలువడుతోంది. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలనే లక్ష్యంతో ప్రతీ ఇంటికి ఉచితంగా రెండేసి ప్లాస్టిక్ డబ్బాలు ఇచ్చారు. చెత్త సేకరించే సైకిల్ రిక్షాలు మొదలుకొని ఆటో ట్రాలీల వరకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసేలా ఏర్పాట్లు ఉన్నా.. అంతా కలిపి సేకరించడం సాధారణంగా మారింది. ట్రాక్టర్లకు మైకులు పెట్టి తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని అధికారులు ప్రచారం చేస్తున్నా ఆచరణలో అమలు కావడంలేదు.

ప్రచారం సరే.. అమలు ఏది?

'ప్రతిఒక్కరూ ఇంట్లోనే తడి, పొడి చెత్త వేరుచేయండి.. తడి చెత్తతో ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో సేంద్రియ ఎరువు తయారు చేసుకోండి.. పొడి చెత్తను విక్రయించి అదనంగా ఆదాయం పొందండి.. మిగిలిన చెత్తన మాత్రమే ఆటో ట్రాలీలకు ఇవ్వండి' అని మైకులతో హోరెత్తిస్తున్నారు. తడి, పొడి చెత్తను కలిపివేయడంతో కలిగే నష్టాల గురించి వివరిస్తూ చేసే ప్రచార హోరు, కాగితాల్లో లెక్కలు తప్ప ఆచరణలో ఎక్కడా వేర్వేరుగా సేకరిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు.

సమయానికి రాక.. రోడ్లపైనే పారబోత

చెత్త తరలించే వాహనాలు సమయానికి నివాసాలకు వెళ్లడంలేదు. దీంతో బల్దియాల్లో చెత్తను రోడ్ల పక్కన పారబోస్తున్నారు. అవగాహన లేకపోవడంతో తడి, పొడి చెత్త విభజన చేయడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపంతో తడి, పొడి చెత్త సేకరణ అమలు కావడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే బల్దియా అధికారులు స్పందిస్తున్నారు. కొన్ని వార్డులు, డివిజన్లలో రెండ్రోజులకోసారి చెత్త తరలించే వాహనం రావడంతో అప్పటివరకు ఇళ్లలోనే నిల్వ ఉంటోంది. చేసేది లేక స్థానికులు కాలనీలో రోడ్ల వెంట పారబోస్తున్నారు. తడి, పొడి చెత్త సేకరణపై ఆయా మున్సిపాలిటీల కమిషనర్లను సంప్రదించగా.. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేలా సిబ్బందికి ఆదేశాలు ఇస్తామన్నారు. ప్రజలకు సైతం అవగాహన కల్పిస్తామని తెలిపారు.

మహిళలు.. మనీరాణులు!

- మండల మహిళా సమాఖ్యలకు 47 బస్సులు
- బస్సుల కొనుగోలుకు రూ.14.10 కోట్లు మంజూరు
- ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా జగిత్యాలకే 15 వాహనాలు
- ఏడేళ్లపాటు సమాఖ్యలకు ప్రతీనెల రూ.77వేలు చెల్లించనున్న ఆర్టీసీ
- ఈ ఆదాయంతో సోలార్ ప్లాంట్లు, ఇతర ప్రత్యామ్నాయ వ్యాపారాలు
- ప్రభుత్వ నిర్ణయంతో ఆత్మవిశ్వాసం పెరిగిందంటున్న మహిళలు



సాక్షిప్రతినిధి,కరీంనగర్: మహిళలు.. మహారాణులు.. అన్నమాట అక్షరాల నిజం కానుంది. అతివలను కోటీశ్వరులను చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పంలో మరో ముందుడుగు పడింది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే.. మరింతగా ఎదుగుతామని ధీమాగా ఉన్నారు. ప్రభుత్వం అందజేసిన ఆర్టీసీ బస్సుల ద్వారా సమకూరే ఆదాయంతో మరిన్ని కొత్త స్టార్టప్‌లు, వ్యాపారాలు మొదలుపెడతామని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా 20కి పైగా మండల మహిళా సమాఖ్యలకు బస్సులను అందజేసింది. ఇందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందినవే ఐదు సమాఖ్యలు ఉండటం గమనార్హం. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం శ్రీ చైతన్య సమాఖ్య, కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఉదయలక్ష్మి సమాఖ్య, సైదాపూర్ మండలం సంతోషిమాతా సమాఖ్య, పెద్దపల్లి జిల్లా ముత్తారానికి చెందిన రుద్రమ సమాఖ్య, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన అభ్యుదయ సమాఖ్యలు తొలివిడతలో బస్సులు పొందారు.

ఉమ్మడి జిల్లాకు 47 బస్సులు..

వాస్తవానికి రాష్ట్రవ్యాప్తంగా 150 మండల మహిళాసమాఖ్యలకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సులు ఇచ్చేందుకు ఎంపిక చేసింది. అందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు 47 బస్సులు కేటాయించింది. పెద్దపల్లి జిల్లాలో 9, రాజన్న సిరిసిల్లలో 9, కరీంనగర్ 14, జగిత్యాల 15 సమాఖ్యలు ఉన్నాయి. నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ (ఎన్.ఆర్.ఎల్.ఎం) పథకంలో భాగంగా కేంద్రం మహిళా సమాఖ్యలకు ఆర్థిక సాయం చేయనుంది. ఈ మేరకు రూ.30 లక్షలు ఈపథకం ద్వారా, మహిళా సమాఖ్య నిధుల నుంచి మరో రూ.6 లక్షలు కలిపి మొత్తం రూ.36 లక్షలు వెచ్చించి ఆర్టీసీ (పల్లె వెలుగు) బస్సులు కొంటారు. 47 బస్సులకు కలిపి రూ.14.10 కోట్ల వరకు నిధులను ప్రభుత్వం మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ బస్సుల ఆర్సీ బుక్‌లో మహిళా సమాఖ్య పేరు మీదే రిజిస్ట్రేషన్ చూపిస్తారు. సమాఖ్యలతో జరిగిన ఒప్పంద మేరకు నిర్వహణ అంతా ఆర్టీసీ చూసుకుంటుంది. ఏడేళ్లపాటు నెలనెలా రూ.77,220 చొప్పున మొత్తం రూ.64 లక్షలపాటు ఆయా సమాఖ్యలకు ఆర్టీసీ చెల్లిస్తుంది. ఇది ఇటు ఆర్టీసీకి, అటు మహిళా సమాఖ్యలకు లాభదాయకంగా ఉండనుంది.

ఆర్థికాభివృద్ధికి వినియోగిస్తాం



ప్రభుత్వం మా సంఘానికి కేటాయించిన ఆర్టీసీ బస్సు ద్వారా వచ్చే రూ.77 వేల ఆదాయానిన సంఘ సభ్యుల ఆర్థికాభివృద్ధికి ఉపయోగిస్తాం. ఆదాయ మార్గాలను అన్వేషించి, కొత్త వ్యాపారం కోసం త్వరలో నిర్ణయం తీసుకుంటాం. సంఘ సభ్యులంతా సమావేశమై సమష్టిగా చర్చిస్తాం. – గుర్రాల మహేశ్వరి, అధ్యక్షురాలు, రుద్రమ మండల సమాఖ్య, ముత్తారం

సోలార్‌ప్లాంట్ ఆలోచనలో ఉన్నాం



ప్రభుత్వం బస్సులివ్వడం ఊహించలేదు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడం, చెల్లించడమే తెలిసిన మాకు ఇది మంచి అవకాశం. నెలనెలా ఆర్టీసీ చెల్లించే డబ్బులతో సోలార్ ప్లాంట్లు పెట్టాలన్న ఆలోచనలో ఉన్నాం. ఇప్పటికే స్థలాలు పరిశీలిస్తున్నాం. సమాఖ్యను ఆర్థికంగా మరింత పరిపుష్టం చేస్తాం. మంత్రి పొన్నం ప్రభాకర్, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్‌లకు ధన్యవాదాలు.

– హరిణి, ఉదయలక్ష్మి సమాఖ్య, చిగురుమామిడి

అన్ని రంగాల్లో ముందుండాలి



మహిళా దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ అరుణశ్రీతో మహిళా సంఘాల ప్రతినిధులు

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ
- బల్దియాలో మహిళా దినోత్సవం

కోల్‌సిటీ(రామగుండం): ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్లతోపాటు రాయితీ రుణాలు సద్వినియోగం చేసుకొని మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీ ఆకాంక్షించారు. బల్దియా కార్యాలయంలో సోమవారం మెప్మా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అరుణశ్రీ మాట్లాడుతూ.. ఈరోజు ఏం సాధించామో సాయంత్రం అవలోకనం చేసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడిని జయించడానికి ఆటలు ఉపకరిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. ఉత్తమ పారిశుధ్య కార్మికులను సత్కరించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, మెప్మా టీఎంసీ మౌనిక, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఊర్మిళ, శ్వేత, ప్రియదర్శిని, శమంత, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నూనె లతామోహన్, ప్రతినిధులు వెంగళ పద్మలత, పరిపూర్ణ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి డీసీపీగా కరుణాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీసీపీగా పనిచేసిన చేతన హైదరాబాద్‌లోని వుమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ అయిన విషయం విదితమే.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పీఎంఎఫ్ఎంఈ (ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్) పథకం కోసం ఈనెల 12 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని జిల్లా పరిశ్రమల అధికారి కీర్తికాంత్ సోమవారం తెలిపారు. రాష్ట్ర ఆహారశుద్ధి సంస్థ ఆధ్వర్యంలో 35 శాతం రాయితీతో అందించే రుణాల కోసం ఆసక్తి, అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాల కోసం డీఆర్పీ రామకృష్ణ, సెల్ నంబరు 63053 45388లో సంప్రదించాలన్నారు. దరఖాస్తులను కలెక్టరేట్‌లోని రూం నంబరు 231లో గల జిల్లా పరిశ్రమల కేంద్రంలో అందించాలని కోరారు.

'ఎనీమియా'ను నియంత్రిస్తాం

- బాధితులకు మాత్రలు, సిరప్ అందిస్తున్నాం
- 'సాక్షి'తో జిల్లా వైద్యాధికారి అన్న ప్రసన్నకుమారి



పెద్దపల్లిరూరల్: 'మనిషికి అవసరమైన ఆక్సిజన్ అందించేందుకు దోహదపడే హిమోగ్లోబిన్ శాతం పడిపోవడమే ఎనీమియా.. దీనిబారిన పడుతున్న వారిని గుర్తించి మందులు, సిరప్ అందిస్తున్నాం.. ఎనిమియా ముక్త్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం' అని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అన్న ప్రసన్నకుమారి తెలిపారు. జిల్లాలో 13,935మంది గర్భిణులు, 12,540 మంది పాలిచ్చే తల్లులు ఉన్నారని, వీరిలో 60శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని ఆమె వెల్లడించారు. పిల్లలు, మహిళల్లో ఇది అధికంగా కనిపిస్తోందన్నారు. బాధితులను గుర్తించి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, సిరప్ అందిస్తూ ఎనీమియా నియంత్రణకు పాటుపడుతున్నామన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వీటిని అందుబాటులో ఉంచామని అన్నారు. 'సాక్షి'తో ఇంటర్వ్యూ వివరాలు..

సాక్షి: ఎనీమియా బారిన ఎవరు పడతారు?

డీఎంహెచ్‌వో: మనిషిలోని అవయవాలను పనిచేయించే ఆక్సిజన్‌ను హిమోగ్లోబిన్ అందిస్తుంది. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తగ్గితే ఎనిమియా బారినపడతారు. అన్ని వయస్సుల వారిలో ఇది కనిపిస్తుంది.

సాక్షి: జిల్లాలో ఇప్పటివరకు ఎంతమంది బాధితులను గుర్తించారు?

డీఎంహెచ్‌వో: కేంద్ర ప్రభుత్వం ఎనీమియాను పూర్తిగా నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమం చేపట్టింది. ఇందుకోసం మా సిబ్బంది పనిచేస్తున్నారు. జిల్లాలో 1,43,159మంది మహిళలు, 10 నుంచి 19ఏళ్లలోపు వయస్సుగల పిల్లలు 1,56,580 మంది వరకు ఉన్నారు. 6 నుంచి 59 నెలలోపు వయసుగల వారు 95,309 మంది, 5 నుంచి 9 ఏళ్ల వయసు గలవారు 78,290మంది ఉన్నారు. వీరిలో దాదాపు 60 శాతం మంది వరకు ఎనీమియాతో బాధపడుతున్నారని మా సర్వేలో తేలింది.

సాక్షి: మందులు అందుబాటులో ఉన్నాయా?

డీఎంహెచ్‌వో: గతంలో మందుల కొరత ఉండేది. ఇప్పుడు పకడ్బందీగా వ్యవహరిస్తున్నాం. ఎనీమియా ముక్త్‌భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. అవసరాలకు అనుగుణంగా పీహెచ్‌సీల స్థాయిలోనూ మందులు పంపిణీ చేస్తున్నాం. 6నుంచి 59నెలల పిల్లలకు ఏడాదికి రెండు సిరప్ బాటిళ్లు అవసరం. ఇక పాఠశాలల్లో చదివే వారికి వీక్లీ ఐరన్ ఫోలిక్ సప్లిమెంట్ అందిస్తున్నాం.

సాక్షి: ఎనీమియా నియంత్రణపై సిబ్బందికి అవగాహన ఉందా?

డీఎంహెచ్‌వో: ఎనీమియా ముక్త్‌భారత్ అమలు తీరు, సాధించాల్సిన లక్ష్యం, అనుసరించాల్సిన పద్ధతులపై ఫార్మసిస్ట్, వైద్య సిబ్బందికి శిక్షణ ఇప్పించాం. బాధితులను గుర్తించి సకాలంలో మందులు అందేలా పకడ్బందీగా వ్యవహరిస్తున్నాం. వయసును బట్టి మోతాదు మాత్రలు, సిరప్ అందిస్తున్నాం.

'ఎల్ఆర్ఎస్'లో 25 శాతం రాయితీ

- గడువులోగా ఫీజు చెల్లిస్తేనే వర్తింపు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష



సూచనలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: గడువులోగా ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లిస్తే 25 శాతం రాయితీ వర్తిస్తుందని, 24 గంటల్లోగా ప్రొసీడింగ్స్ జారీచేస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఎల్ఆర్ఎస్, లే ఔట్ క్రమబద్ధీకరణపై డాక్యుమెంట్ రైటర్లు, రియల్టర్లతో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై కలెక్టర్ అవగాహన కల్పించారు. జిల్లాలో 16వేల స్థలాల క్రమబద్ధీకరణ కోసం యజమానులకు ఫీజు వివరాలు అందించామని అన్నారు. ఇప్పటి వరకు 400మంది మాత్రమే స్పందించారని ఆయన పేర్కొన్నారు. సందేహాల నివృత్తి కోసం మున్సిపల్ ఆఫీసులో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. క్రమబద్ధీకరణ పూర్తికాని ప్లాట్లు రిజిస్ట్రేషన్ కాకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో లింక్ చేశామని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

అధికారులతోనూ సమావేశం..

అంతకుముందు కలెక్టర్ శ్రీహర్ష కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి అధికారులతో సమావేశమై అక్రమ లేఔట్లపై సమీక్షించారు. లే ఔట్ నిబంధనలు పాటించని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయొద్దని ఆదేశించారు. ఆర్డీవోలు గంగయ్య, సురేశ్, కమిషనర్లు వెంకటేశ్, మనోహర్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో 2డీ ఎకో సేవలు..

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా 2డీ ఎకో సేవలు అందిస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. క్లినికల్ కార్డియాలజిస్ట్‌గా నియమితులైన ప్రియాంక కలెక్టర్‌ను కలిశారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

- రామగుండం సీపీ అంబర్‌కిశోర్ ఝా
- బాధ్యతలు స్వీకరించిన పోలీస్ అధికారి



బాధ్యతలు స్వీకరించిన అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని: చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనర్‌గా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణే తమ ధ్యేయమన్నారు. సత్ప్రవర్తన కలిగిన వారికి ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణకు కృషి చేస్తామని తెలిపారు. ల్యాండ్ మాఫియా, డ్రగ్స్, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, ప్రజల సహకారంతో ముందుకెళ్తామన్నారు. ఠాణాలకు వచ్చే వారి సమస్యలను త్వరిత గతిన పరిష్కరిస్తూ, చట్ట పరిధిలో న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు.

2009 ఐపీఎస్ బ్యాచ్..

అంబర్ కిశోర్ ఝా 2009 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన పోలీస్ అధికారి. 2011లో తొలిసారి ఉమ్మడి ఆదిలాబాద్ ఏఎస్పీ, 2012 వరంగల్ ఓఎస్డీగా, అదనపు ఎస్పీగా, 2014లో వరంగల్ ఎస్పీగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తొలిఎస్పీగా పనిచేశారు. 2018లో హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా, అదే ఏడాది కేంద్ర సర్వీసుల్లో విధులు నిర్వహించారు. గతేడాది ఫిబ్రవరిలో డీఐజీగా పదోన్నతి లభించింది. రాచకొండ జాయింట్ పోలీస్ కమిషనర్‌గా పనిచేశారు. అంతకుముందు వరంగల్ సీపీగా పనిచేశారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన సీపీకి మంచిర్యాల, పెద్దపల్లి డీసీపీలు భాస్కర్, కరుణాకర్ తదితరులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

టెన్త్ పరీక్షలకు 41 కేంద్రాలు

- 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు
- జిల్లా విద్యాధికారి మాధవి



మాట్లాడుతున్న డీఈవో మాధవి

పెద్దపల్లిరూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలకు సుమారు 7వేల మంది విద్యార్థుల కోసం 41 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులు, సూపరింటెండెంట్ ప్రకాశ్‌తో కలిసి పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష సమయాల్లో ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటర్ పరీక్షలకు 91మంది గైర్హాజరు

జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ సెకండియర్ వార్షిక పరీక్షలకు మొత్తం 91మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి కల్పన తెలిపారు. ఇంగ్లిష్ పరీక్షకు 4,801మంది విద్యార్థులకు 4,710మంది హాజరయ్యారని పేర్కొన్నారు. హాజరు శాతం 98.10శాతంగా ఉందని వివరించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


వాణి(ఫైల్)

కమాన్‌పూర్(మంథని): మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై కమాన్‌పూర్ ఎక్స్‌రోడ్డు బాపూజీనగర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన దొంతుల వాణి(48) మృతి చెందింది. వాణి తన భర్త సురేశ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై కమాన్పూర్ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో మంథని వైపు నుంచి పెద్దపల్లి వైపు ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొంది. వాణి ద్విచక్రవాహనం పైనుంచి పడడంతో లారీ ఆమె పైనుంచి వెళ్లింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త త్రుటిలో ప్రాణాపాయం తప్పించుకున్నాడు. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. పోలీసులను సంప్రదించగా.. తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బావిలో పడివ్యక్తి..

రామగిరి(మంథని): బేగంపేట గ్రామానికి చెందిన బొనగిరి నర్సయ్య(45) సోమవారం బావిలో పడి మృతి చెందాడు. బేగంపేట సబ్‌స్టేషన్ సమీపంలోని కట్ట రాజీర్‌కు చెందిన వ్యవసాయ బావిలో శవమై కనిపించగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నర్సయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

20 మంది సింగరేణి అధికారుల బదిలీ



గోదావరిఖని: సింగరేణి వ్యాప్తంగా 20మంది మైనింగ్‌అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. బదిలీ అయిన వారిలో.. రామగుండం రీజియన్‌కు చెందిన అధికారులు నలుగురు ఉన్నారు. వీరిలో మందమర్రి కేకే–5లో పనిచేస్తున్న ప్రవీణ్ వి ఫ్యాటింగ్ అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేశారు. జీడీకే–1 గనిలో డీవైజీఎంగా పనిచేస్తున్న డి.రమేశ్‌ను మణుగూరు ఏరియా పీకే ఓసీ మేనేజర్‌గా, శ్రీరాంపూర్ డివిజన్ ఎస్ఆర్‌పీ ఓసీపీ–2లో కాలరీ మేనేజర్‌గా పనిచేస్తున్న బ్రహ్మాజీని ఆర్జీ–1 క్వాలిటీ మేనేజ్‌మెంట్ అధికారిగా బదిలీ చేశారు. మందమర్రి ఏరియా ఆర్కేపీ ఓసీ కాలరీ మేనేజర్‌గా పనిచేస్తున్న సుధీర్‌జయవంత్‌రావును జీడీకే–1గని మేనేజర్‌గా నియమించారు.

తూర్పున ఆడ.. పశ్చిమాన మగ

పులి.. ప్రేమ

- తోడు కోసం కి.మీ.ల మేర ప్రయాణం
- సిగ్నల్స్ లేదా.. మరో రకంగా గుర్తుపట్టే అవకాశం
- జత కలుస్తాయా.. వేర్వేరుగానే వెళ్తాయా?
- అటవీ శాఖ అధికారుల్లో అనేక అనుమానాలు



మంథని: రెండక్షరాల ప్రేమ మనషులనే కాదు.. మూగజీవాలనూ ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ప్రేమ కోసం ఖడాంతరాలు దాటి ప్రయాణాలు చేసిన వారున్నారు.. ప్రాణాలు లెక్క చేయకుండా ప్రేమను గెలిపించుకున్న వారూ చరిత్రలో నిలిచిపోయారు.. ఆ కోవలో జంతువులు సైతం భాగస్వామిని కలుసుకునేందుకు రాష్ట్రాలు దాటి ప్రయానం చేస్తున్నాయి. రెండు పెద్దపులుల ప్రేమకథ ఇది.

మహారాష్ట్ర నుంచి ఆడపులి..

మహారాష్ట్ర అటవీప్రాంతంలోని ఓ ఆడపులి ప్రేమికుడిని వెతుక్కుంటూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గోదావరి నది, మానేరుతీర ప్రాంతాల్లో కొద్దిరోజులుగా సంచరిస్తోంది. ఇదే సమయంలో పశ్చిమ అడవుల్లోనూ ఓ మగపులి సంచారం ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసుల్లో భయాందోళనలు కలిగిస్తోంది. సుమారు ఇరవై రోజుల క్రితం మంచిర్యాల జిల్లా చెన్నూరు అడవుల నుంచి ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అడవులు.. అటు నుంచి మంథని అడవులకు మీదుగా ఆడపులి ఉమ్మడి జిల్లాకు చేరుకుంది. పాదముద్రల ఆధారంగా అది ఇక్కడ సంచరిస్తోందని అటవీ అధికారులు నిర్ధారించారు. పశ్చిమాన వేములవాడ సమీపం ఫాజుల్‌నగర్ అటవీప్రాతంలో మగపులి సంచరించినటుల్‌ తెలుస్తోంది. రెండు పులుల పాదముద్రలు 12 సెం.మీ. – 13 సెం.మీ. వరకు, 3–4 సంవత్సరాల వయసు ఉంటుంది. ఒకదశలో రెండుచోట్ల సంచరిస్తున్న పులి ఒక్కటే అనే అనుమానాలు వ్యక్తమైనా.. ఒకేసమయంలో రెండుచోట్ల పులి సంచరిండంతో వేర్వేరు పులుగా స్పష్టమవుతోంది. జత కలిసేందుకే కి.మీ. కొద్దీ పయనిస్తున్నాయి. వాటిని చూసి అటవీ ప్రాంత జనం జాగరణ చేస్తోంది.

కలయిక కోసమా?

వేసవిలో తోడు కోసం పులులు అనువైన ప్రాంతాల్లో అన్వేషణ చేయడం సాధారణం. ప్రస్తుతం తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో సంచరిస్తున్న పులులు జత కోసమేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనువైన ప్రాంతాలు.. అనుకూల ప్రదేశాలు, జంతువులు నివాసం ఉండే ఉండేవి. తమ భాగస్వామిని కలుసుకునే జంతువుల్లో ఏదో ఒకరకమైన సమాచార వ్యవస్థ ఏర్పడుతుందని అటవీ అధికారులు భావిస్తున్నారు. మనుషుల్లో లాగా ప్రేమను వ్యక్తపరిచే అవకాశం లేకపోవడంతో సిగ్నల్స్ లేదా.. మరోరకంగా(వాసన) తమతోడును జంతువులు గుర్తుపట్టేలా చేస్తాయి. పులి రోజూ 20 కి.మీ. నుంచి 50 కి.మీ. వరకు ప్రయాణించే అవకాశం ఉన్నట్లు అధికారులు అంటున్నారు. భాగస్వామి కోసం ఎక్కువదూరం సైతం వెళ్లే అవకాశమూ ఉందంటున్నారు. ఇలా తూర్పు నుంచి పశ్చిమానికి పయనించే క్రమంలో రెండు పులులు ఎక్కడైనా ఎదురయ్యే అవకాశం ఉన్నట్లు అభిప్రాయపడుతున్నారు. పశ్చిమాన ఉన్న పులి సైతం తోడు కోసమే సంచరిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. దట్టమైన అటవీప్రాంతం ఇప్పుడు మైదానంగా మారడంతో వాటి ఉనికి ప్రశ్నార్థకమైంది, దీంతో మనుషులు ఉండే ప్రాంతాలకు వచ్చి ఆవులు, మేకలతోపాటు పలు జంతువులను వేటాడి ఆకలి తీర్చుకుంటున్నాయి. కొద్దిరోజుల క్రితం జయశంకర్ భూపాలపల్లి అటవీ ప్రాంతంలో ఓ జంతువుపై దాడిచేసిన పులి.. ఏకంగా గ్రామాల సమీపంలోనే ప్రజలకు కనబడటంతో తీవ్ర భయాందోళకు గురయ్యారు. తనకు జతదొరికే వరకు పులి ఇలాగే సంచరిస్తూ దాడులు చేస్తే ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందని అటవీ ప్రాంత ప్రజలు వణికిపోతున్నారు.

తోడుగానా.. విడిగానా?

తోడుకోసం పయనిస్తున్న పులులు కలిసే వరకూ సంచరిస్తాయా లేక వచ్చిన దారినే వెళ్తాయా? అనేది తెలియరావడంలేదు. పులులు సంచరించే ప్రాంతాన్ని గుర్తించేందుకు పాదముద్రల ఆధారం అయినా.. ఎటు నుంచి ఎటు వెళ్లాయనేది ఎవరికీ అంతు చిక్కడం లేదు. సీసీ కెమెరాలు, ట్రాకింగ్ బృందాలు అన్వేషిస్తున్నా అటవీశాఖకు వాటి కదలికలు లభించినట్లు ఎక్కడా వెల్లడించడం లేదు. జతకలిశాక తోడుగా వెళ్తాయా, విడిగానే తమదారి తాము చూసుకుంటాయా? అనేది తేలాల్సి ఉంది. వీటిబారిన పడకుండా పల్లెవాసులను అటవీ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఏదిఏమైనా తోడు కోసం తిరుగుతున్న పులుల ప్రేమకథ ఆసక్తిగా మారింది.

రంజాన్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్


మద్దిర్యాలలో ముగ్గు పోస్తున్న ఎమ్మెల్యే ఠాకూర్

గోదావరిఖని: రంజాన్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఈద్గా, ఫోరింక్లయిన్ ఈద్గాను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసుకునేందుకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, మారెల్లి రాజిరెడ్డి, శ్రీనివాస్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆర్జీ–1 ఏరియా సింగరేణి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ముద్రించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆవిష్కరించారు. నాయకులు చిలుక శ్రీనివాస్, వంసత్‌కుమార్, దేవాచారి, దేవులపల్లి రాజేందర్, దీటి చంద్రమౌళి, కుమరస్వామి, శ్రీనివాస్, సతీశ్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో రెండు గేట్‌పాస్

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులు ఇకనుంచి ఏడాదిలో రెండు గేట్ పాస్‌లు తీసుకుంటే సరిపోతుందని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు ఆయన గేట్ పాస్‌లు అందజేసి మాట్లాడారు.

హనుమాన్ విగ్రహ నిర్మాణ ప్రగతి పరిశీలన

రామగుండం: రామునిగుండాల కొండపై చేపట్టిన హనుమాన్ భారీ విగ్రహ నిర్మాణ ప్రగతిని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ పరిశీలించారు. 150 అడుగుల ఎత్తుతో పంచముఖ హనుమాన్ విగ్రహ నిర్మాణం చేపట్టామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రతినిధులు కొలాని వెంకట్‌రెడ్డి, ఆసిఫ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

అంతర్గాం మండలం మద్దిర్యాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. తహసీల్దార్ రవీందర్ పటేల్, ఎంపీడీవో వేణుమాధవ్ ఉన్నారు.

చెక్కులు అందజేత

పాలకుర్తి(రామగుండం): 40 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఠాకూర్ షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. అనంతరం రామారావుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. తహసీల్దార్ జ్యోతి తదితరులు హాజరయ్యారు.

విధి నిర్వహణలో ఆగిన ఊపిరి


రాంచందర్ మృతదేహం

జైపూర్: ఆయన ఓ యువ కార్మికుడు. మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ ద్వారా మూడేళ్ల క్రితం సింగరేణి ఉద్యోగం పొందాడు. శిక్షణ పూర్తి చేసుకుని ప్రస్తుతం శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఐకే–1ఏ గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం దాసరిపల్లి నుంచి నిత్యం విధులకు హాజరవుతున్నాడు. ఈ క్రమంలో రోజుమాదిరిగానే సోమవారం ఉదయం విధులకు వచ్చాడు. విధులు నిర్వహిస్తూనే కుప్పకూలాడు. తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దాసరిపల్లి గ్రామానికి చెందిన పసునూరి సుభద్ర–రాజమల్లు దంపతుల కుమారుడు రాంచందర్(32) తన తండ్రి మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ ద్వారా మూడేళ్ల క్రితం ఉద్యోగం పొందాడు. ఐకే–1ఏ గనిలో విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాంచందర్ భూగర్భ గనిలోకి కార్మికులు వెళ్లే రెండో మ్యాన్‌రైడింగ్ వద్ద మోటార్ ఆన్, ఆఫ్ సిస్టం మెయింటెన్స్ వర్కక్ కేటాయించారు. ఉదయం 7 నుంచి 8:30 గంటల వరకు రెండో మ్యాన్ రైడింగ్ ద్వారా కార్మికులు గనిలోకి దిగగా రాంచందర్ మ్యాన్ రైడింగ్ ఆపరేట్ చేశాడు. 9:20 తర్వాత కళ్లు తిరగడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన సహచర కార్మికులు సపర్యలు చేశారు. అయినా పరిస్థితి మెరుగు పడకపోవడంతో సీపీఆర్ కూడా చేశారు. అయినా స్పందన లేకపోవడంతో వెంటనే రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఒక్కగానొక్క కొడుకు..

సుభద్ర–రాజమల్లు దంపతులకు రాంచందర్, ఇద్దరు కూతుళ్లు సంతానం. ఒక్కగానొక్క కొడుకు ప్రయోజకుడు కావాలని రాజమల్లు మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ ద్వారా తన ఉద్యోగాన్ని మూడేళ్ల క్రితం కొడుకుకు పెట్టించాడు. అప్పటి నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. అయితే అకస్మాత్తుగ ఒకగానొక్క కొడుకు విధి నిర్వహణలో మరణించడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. తమకు అండగా ఉంటాడనుకున్న కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. రాజమల్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

42 శాతం రిజర్వేషన్లతో బీసీలు ఎదగాలి


కోడెమొక్కు చెల్లిస్తున్న పొన్నం

వేములవాడ: 42 శాతం రిజర్వేషన్లతో బీసీలు ఐక్యంగా ఎదగాలని బీసీ సంక్షేమ, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన చేసిన సర్వే తర్వాత జరుగుతున్న శాసనమండలి ఎన్నికల్లో సీట్లను బలహీనవర్గాలకు కేటాయించడమే ఇందుకు నిదర్శనమన్నారు. వేములవాడ రాజన్నను కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. అనంతరం పట్టణంలోని మహాలక్ష్మీవీధిలో గౌడసంఘం నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు 55 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు చేయడం మంచి నిర్ణయమన్నారు.


పుట్ట బంగారం వేదిక వద్ద పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు


బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు

శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముందుగా ప్రధాన ఆలయమైన శ్రీయోగానందా స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆనవాయితీ ప్రకారం యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచారి దంపతులను ఆలయం పక్షాన మేళతాళాలతో వారి గృహానికెళ్లి స్వాగతం పలికారు. పూలమాలలు, స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించి దేవాలయానికి ఆహ్వానించారు.

ఘనంగా పుట్ట బంగారం వేడుకలు

బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజైన సోమవారం సాయంత్రం స్థానిక చింతామణి చెరువు కట్ట వద్ద పుట్ట బంగారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి పుట్ట బంగారం వేదిక వద్దకు మేళతాళాలతో తీసుకెళ్లారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు చేసి పుట్టను తవ్వి ఆ మట్టిని ఆలయాని తీసుకొచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


ధర్మపురిలో యజ్ఞాచార్యుల దంపతులను మేళతాళాలతో తీసుకెళ్తున్న దేవస్థానం సిబ్బంది

సమస్యలు విని.. పరిష్కరించాలని ఆదేశించి..

- ప్రజావాణికి పోటెత్తిన దరఖాస్తుదారులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష.. వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలు సమస్యలపై దరఖాస్తులతో వచ్చిన వారితో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. వారి సమస్యలకు పరిష్కారం చూపుతామని ఆయన భరోసా ఇచ్చారు.

దోమలు బాధిస్తున్నాయి

పెద్దపల్లి టీచర్స్ కాలనీలోని ఇండ్ల మధ్య మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వృద్ధి వ్యాధులు వస్తున్నయి. వీలైనంత త్వరగా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

–బొంకూరి ప్రవీణ్, టీచర్స్‌కాలనీ, పెద్దపల్లి

పేరు తొలగించాలి



నాకు ముగ్గురు అమ్మాయిలు. రేషన్ కార్డులో ఇదివరకు అందరి పేర్లుండేవి. ఇప్పటికే ఓ అమ్మాయి పేరు తొలగించారు. మరో అమ్మాయి పేరు కూడా తొలగించాలని అంతర్గాం మండల అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. కలెక్టర్, ఉన్నతాధికారులైనా చొరవచూపి రేషన్ కార్డులో నుంచి పేరు తొలగించాలి.

–సంపత్‌రెడ్డి, గోలివాడ

పింఛన్ ఇప్పించండి



ఏ పనిచేయలేని నిస్సహాయస్థితిలో ఉన్న. ప్రభుత్వం నుంచి పింఛన్ మంజూరు చేయించండి. ఐదేళ్ల నుంచి అధికారులకు దరఖాస్తు చేస్తున్న. ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న. ఎవరూ పట్టించుకోవడం లేదు. పక్షవాతంతో బాధపడుతున్న. దుర్భర జీవితం గడుపుతున్న. ఉన్నతాధికారులు చొరవ చూపి ఆదుకోవాలి.

– బోయిని రాజయ్య, ముత్తారం

పాసుబుక్కు ఇప్పించాలి



అంతర్గాం మండలం పొట్యాలలో సాగు చేసుకుంటున్న భూమికి పట్టాదారు పాసుబుక్కు ఇప్పించాలి. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని నాలుగేండ్లుగా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న. పాసుబుక్కు రావడం లేదు. అధికారులు చొరవ చూపాలి.

– లచ్చయ్య, పొట్యాల

'యువికా'తో ఆలోచనలకు మెరుగు

- యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు అవకాశం
- ఇస్రో యువ విజ్ఞాన కార్యక్రమ్ – 2025
- విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- తొమ్మిదో తరగతి విద్యార్థులు అర్హులు

జ్యోతినగర్(రామగుండం): భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)స్కూల్ విద్యార్థుల కోసం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం 'యువ విజ్ఞాన కార్యక్రమ్(యువిక)– 2025' ద్వారా పిల్లల ఆలోచనలకు మెరుగులు దిద్దితే.. భావితరానికి శాస్త్రవేత్తలుగా మార్చుకోవచ్చనే విషయాన్ని గుర్తించిన ఇస్రో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు అంతరిక్ష సాంకేతిక, అంతరిక్ష శాస్త్రం, అనువర్తనాలపై ప్రాథమిక జ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా యంగ్ సైంటిస్ట్ పేరుతో యువ విజ్ఞాన్ కార్యక్రమం(యువికా) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ మేరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈనెల 23వ తేదీ లోగా అర్హులైన, ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా తొమ్మిదో తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు తెలిపారు.

వెబ్‌సైట్:

విద్యార్థులు దరఖాస్తు చేసేందుకు వీలుగా ఆన్‌లైన్‌లో (www.isro.gov.in) వెబ్‌సైట్ ప్రారంభించారు. సైట్ ఓపెన్ చేసిన తర్వాత యువికా ఆప్షన్ క్లిక్ చేయాలి. అందులో విద్యార్థికి సంబంధించిన వివరాలతో దరఖాస్తు పూరించాలి.

- ఎనిమిదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా 50 శాతం వెయిటేజీ ఇస్తారు.
- జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపితే 10 శాతం వెయిటేజీ ఉంటుంది.
- స్పేస్, సైన్స్ క్లబ్‌లో నమోదై ఉంటే 5 శాతం..
- ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాల్లో ఉంటే 5 వాతం..
- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 20 శాతం వెయిటేజీ లభిస్తుంది.


దరఖాస్తుల దాఖలుకు గడువు..

- ఈనెల 23 తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణకు గడువు ఉంది
- ఏప్రిల్ 7న ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు.
- మే 18న విద్యార్థులను ఆహ్వానిస్తారు.
- మే 19 నుంచి 30 వరకు యువికా–2025 కార్యక్రమం నిర్వహణ
- మే 31న ముగింపు కార్యక్రమంలో ప్రతిభ కనభర్చిన విద్యార్థులకు బహుమతుల పంపిణీ.
- ఎంపికైన విద్యార్థులు బస్సులు, రైళ్ల ద్వారా వెళ్తే ప్రయాణ రాయితీ కల్పించడంతో పాటు వసతి, బస ఏర్పాటు చేస్తారు.

యువికా ఉద్దేశం ఇదే..

ఇస్రో నిర్వహిస్తున్న యువికాకు ఎంపికైన విద్యార్థులతోపాటు కుటుంబ సభ్యుల్లో ఒకరు అంతరిక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఇస్రోకు చెందిన అహ్మదాబాద్, డెహ్రాడూన్, తిరువనంతపురం, షిల్లాంగ్, బెంగళూరు, హైదరాబాద్, సూళ్లూరిపేట తదితర కేంద్రాల్లో మేలో రెండు వారాల పాటు శిక్షణ తరగతులు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. వివిధ రాష్ట్రాల్లోని స్పేస్ సెంటర్లకు తీసుకెళ్తారు. విద్యార్థులకు ప్రముఖ శాస్త్రవేత్తలతో ముఖాముఖి, చర్చా వేదికలు, ప్రయోగశాలల సందర్శన, ముఖ్యులతో సమావేశాల్లో పాల్గొనేందుకు అవకాశమిస్తారు. అంతరిక్ష శాస్త్రం, రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పిస్తారు.

విద్యార్థులకు చక్కని అవకాశం



ఇస్రో నిర్వహిస్తున్న యంగ్ సైంటిస్ట్ కార్యక్రమం విద్యార్థులకు చక్కని వేదిక. విద్యార్థులు తమ ప్రతిభను వెలికితీసుకునేందుకు చక్కని అవకాశం. తల్లిదండ్రులు, సంబంధిత ఉపాధ్యాయులు ఆసక్తి ఉన్న విద్యార్థులతో దరఖాస్తులు చేసే విధంగా ప్రోత్సహించాలి.

– రవినందన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. నిమ్మనపల్లిలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోసి పనులను ప్రారంభించారు. మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ఫయాజ్, కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు బండారి రామ్మూర్తి, సుధాకర్‌రెడ్డి, ప్రదీప్, ఆంజనేయరావు, సంపత్‌రావు ఉన్నారు.

మహిళాభ్యున్నతే లక్ష్యం..

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మున్సిపల్ ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో మెప్మాలోని 141 మహిళా సంఘాలకు రూ.19,58,50,000 రుణాలు అందించారు. అంతకుముందు మొబైల్ టిఫిన్ సెంటర్ ప్రారంభించారు. కమిషనర్ వెంకటేశ్ పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి, సీడీపీవో కవిత తదితరులు ఉన్నారు. అనంతరం రంగంపల్లిలోని సఖి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆ తర్వాత జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్షించారు.


నిమ్మనపల్లిలో ముగ్గు పోస్తున్న ఎమ్మెల్యే విజయ్

సంక్షేమ పథకాల అమలు ధ్యేయం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న సంక్షేమ పథకాలన్నీ అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. అంకంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సారయ్యగౌడ్, లంక సదయ్య, రామిడి తిరుపతిరెడ్డి, గాజనవేన సదయ్య, అధికారులు పూర్ణచందర్‌రావు, జగదీశ్, నాగార్జున, కిరణ్, అంకూస్‌వలీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఓదెల: కనగర్తి, జీలకుంట, గూడెంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.